# ఎద్దు

**అం**కె వేసింది!

నాలుగు రోడ్ల మొగని నించుని దిక్కులదిరేలాగ రంకె వేసింది.

ఏనుగంత ఎద్దు... తెల్లని జున్ను ముక్కలా పొంకంగా వుంది. రైలింజనుకి కట్టినా లాగిపారేస్తుందన్నంత బలిష్టంగా వుంది!

"ఎవరిదో?" - కావడి భుజాన మార్చుకుని ఆశగా ఓ చూపు చూసి, చప్పరించి వెళ్ళిపోయాడు "గురువులు" తప్పిపోనాది గావాల" - అంటూ...

సింహం నాగుంది... తస్సదియ్యా... యిట్టవొదిలేసినారే..." చుట్ట నోట్లోంచి తీసి, ఆశ్చర్యం వెలిబుచ్చి, చుట్ట మళ్లీ చప్పరించుకున్నాడు వెంకయ్య.

నలుగురైదుగురు యిట్టావంటి, సందేహాలు, సమాధానాలు కలిపి వ్యక్తపరిచి, "మనది కానిది మనకెందుకూ?" అనుకుని వెళ్ళిపోయారు.

నూకమ్మ చూసింది.

నూకమ్మంటే అమ్మతల్లి లాటిదే...

గుమ్మంలో పిడకలు ఎండలో పెడుతూ చూసింది.

ఎద్దు నలుదిక్కులా - "ముక్కునతాడు వెయ్యగల మొనగాడున్నాడా?" అన్నట్లు చూసింది.

'ఎవరిదో..." అనుకుంది నూకమ్మ. ఎద్దు తిరిగి రంకె వేసింది. "ఇంకా బండికెయ్యలేదల్లే వుంది..పొగరుగా వుంది. భలేగిత్త!"-ఎర్రకోక కట్టుకొని, నల్లరవికె ధరించిన నూకమ్మ తలపోసింది - పిడకలు పేరుస్తూ.

ఎద్దుయిటుకేసి తిరిగింది. నూకమ్మకి వొళ్లుమండింది.

"ఇటు రాయేలంజా!!" అంది.

నందిలాగ గంగడోలు ఆడించింది వృషభరాజం!

రాజఠీవితో అడుగులేస్తూ వచ్చింది. నిజంగా నూకమ్మ తిట్టిన తిట్టు తన మగతనం తెలీకనే అయ్యుంటుందను కుందా పశువు!

నూకమ్మ లేచి నిల్చుంది!

కొంగు బొడ్డులో దోపుకుంది. నూకమ్మ సామాన్యురాలు కాదు. ఆమె గొంతుక వింటే ఆ నాలుగు వీధుల్లోనూ హడల్!

ఎద్దు గిట్టల క్రింద పిడకలు, పచ్చివేమో - పితపిత లాడేయి.

ఉగ్రురాలయింది నూకమ్మ.

గుర్రుగుర్రున ఎద్దుతలూపింది.

"నీ మొండి కొమ్ములు తగలెయ్య..." అని ఎద్దు మెడనమాంతం దొరక పుచ్చుకుంది నూకమ్మ.

ఎద్దు ఒక కొమ్ము విసిరినా నూకమ్మ ఎగిరి అవతలపడును గాని -

ఎద్దు బెదిరింది నూకమ్మ శరీర సౌష్ఠవానికి గాని, అంగబలానికి గాని కాదు. నూకమ్మ నోటిధాటికి, ఎర్రకోక రంగుకీ!

xxx

నూకమ్మ గుమ్మంలో ఎద్దు - లాకాయి, లూకాయి కాదు సాక్షాత్ నంది లాంటి దాన్ని చూసి- దారిన వెళ్లే వాళ్ళు సైతం విస్మయపడ్డారు.

భోగట్టా చేసేరు కుతూహలంగా. నూకమ్మ అంది - "మా వాళ్లదే... బేరానికి పట్నం తెచ్చేరయ్యా... నాలుగొందలు చేస్తది"

ఇరుగూ, పొరుగూ గుసగుసలు పోయేరు. బయటికి అన్నారో అసలు వడ్డీలతో సహా వాళ్ల ప్రాణాలు తోడేస్తుంది నూకమ్మ!

నూకమ్మని హడల గొట్టేవాడు జగ్గడు ఒకడు లేక పోలేదు. జగ్గడు గళ్లలుంగీ కట్టుకొని , రంజుగావచ్చి- "ఇదేంటేహె! నూకమ్మ ఎద్దుని తెచ్చింది... నాకు తెలియాలా? వద్దా?..." అంటూ గుమ్మం ఎక్కేడు.

వృషభం ఓ కొమ్ము విసిరింది.

జగ్గడికి గుండెలు జారిపోయి, ఎగిరి అవతలపడి - "హెహె! రౌడీ జగ్గడు మనపేరు... యినలే? ... దాన్నే అడుగు... నూకమ్మోదిన్ని... మనసంగతిచెబుద్ది"- అంటూ బీరాలు చెప్పేడు.

అంతలో నూకమ్మ వచ్చింది.

జగ్గడామెను లోనకి అనుసరించేడు.

xxx

"ఉహూఁ! సగం... సగం..." అది మగ గొంతు. "ఛస్! ఎదవపేరాశ... ఏభయి అంతే..." అది ఆడ కంఠం.

"నీ కొంప కెసరెడతా... ఖబర్‌దార్," జగ్గడు పూనకం ఎత్తినట్లు లేచేడు.

"ఏడిశావ్!... చెప్పుచ్చుక్కొడతా... నీ పరువంతా బయట పెడతా..." నంటూ నూకమ్మ రెచ్చిపోయింది.

అంటే, ఎద్దుని అమ్ముకుని పంచుకోవాలని చూస్తున్నారనీ... అది దొంగసొత్తనీ తెలిసింది - యిరుగు వీరాసామికీ, పొరుగు పోలయ్యకీను.

అయితే నూకమ్మతో రాజీ కుదరడం కష్టం...

ఫలితం వైరం!

దాంతో వీరాసామి పెళ్లాం, రంకు దన్న ప్రచారం నూకమ్మ చేసిందని, పోలయ్యన్నాడు. పోలయ్య దొంగ సారా తాగే దొంగ ఎదవ"అని వీరాసామి అన్నాడని నూకమ్మంది.

xxx

రౌడీ జగ్గడు మీసం మెలేసి నవ్వేడు. పోలీసులు వచ్చి, నూకమ్మయిల్లు సోదాచేసి, అయిదువందలు విలువచేసే నగలు పట్టుకున్నారు. అణాలకీ, బేడలకీ - వడ్డీలకి ఆశపడే నూకమ్మ నోరు పడిపోడమేకాదు... కడుపుకి దెబ్బ తగిలింది...

పోలయ్య మీద నూకమ్మ చెప్పింది! పోలయ్య ఆ కసితో వీరాసామి మీద అభాండాలువేసేడు!!

పోలీసులకి సంబరం లాగుంది యిదంతా. బాగా పుంజుకుని, వచ్చినంతా గుంజుకున్నారు.

నూకమ్మ కన్నీటి చారలు తుడుచుకోనేలేదింకా...

నోరులేని పశువు దారి తప్పి వచ్చింది గందాని గుంజకి కట్టేసేవ్.. యిదే మన్నా న్యాయమా?' అంటూ ముష్కరుల్లాంటి నలుగురు దిగబడి ఎద్దుని దర్జాగా యిప్పుకు పోయారు.

"గంయ్" మంటే గొంతు నాలుగు వీధులు దాకా వినిపించే నూకమ్మ; గుడ్డ నోట గుక్కుకొని ఏడ్చింది... నోరు విప్పలేదు!

పోలయ్యా, వీరాసామి... జగ్గడూ-ముగ్గురూ కలిసి; ఆ నలుగురు మనుషులనూ పంపి, ఎద్దును విప్పుకు తీసుకుని పోయారని నూకమ్మ వూహించలేకపోయింది!

వీరాసామి "యిహిహీ..." అని లేని మీసం త్రిప్పినా, జగ్గడు వున్న కాస్త క్రాపుని పైకి చేత్తో ఎగ దువ్వినా - చూసిన వెర్రిబాగుల్ది మెటికలు విరిచిందంతే! .....

**(1961 ఆంధ్రప్రభ వారపత్రిక )**